మలిసంధ్యలో భరోసా

- వృద్ధులకు ఆశ్రయం
- పూర్తయిన ప్రభుత్వ వృద్ధాశ్రమ నిర్మాణం
- ప్రవేశాలే తరువాయి
- అన్ని సౌకర్యాలు కల్పించిన అధికారులు

తంగళ్లపల్లి: కంటికి రెప్పలా కన్న పిల్లల్ని పెంచి, పెద్దచేసి ప్రయోజకులను చేస్తే చివరకు పిల్లల నిరాధరణకు గురైన వారు కొందరైతే.. జీవితాంతం కష్టపడి కూడబెట్టి కడుపున పుట్టిన వారిని గారభంగా పెంచి పెద్దచేస్తే తమకు డబ్బే కావాలి మీరొద్దు అని బయటకి గెంటేసిన వారు మరికొందరూ. కారణం ఏదైతేనేమి ఇంటి నుంచి బయటకు గెంటి వేయబడి రోడ్డుపై చేరుతున్న వృద్ధుల సంఖ్య క్రమేనా పెరుగుతూ వస్తోంది. ఇలాంటి వృద్ధులకు అండగా ఉండేందుకు మానవతా దృక్పథంతో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాలే బాసటగా నిలుస్తున్నాయి. కానీ ఇప్పుడు నిరాశ్రయులైన వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలబడనుంది. మహిళాభివృద్ధి, దివ్యాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తొలి ప్రభుత్వ వృద్ధాశ్రమం ఏర్పాటు కానుంది.

వృద్ధులకు అండగా..

మండలంలోని మండెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సుమారు నాలుగు ఎకరాల స్థలంలో ప్రభుత్వ వృద్ధాశ్రమం నిర్మాణం పూర్తయ్యింది. ఈ భవనంలో కిచెన్, హాల్, డైనింగ్ హాల్, రెండు పడక గదులు, ర్యాంపులు, టాయిలెట్స్, చుట్టూ పచ్చదనం కనిపించేలా వందల సంఖ్యలో మొక్కలు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఇప్పటికే అధికారులను ఆదేశించగా అన్ని సౌకర్యాలను కల్పించారు.



మండెపల్లిలో సిద్ధమైన ప్రభుత్వ వృద్ధాశ్రమం

అన్ని వసతులతో..

ఇన్నాళ్లు ప్రభుత్వం నుంచి వృద్ధాశ్రమం లేక అనేక మంది వృద్ధులు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాల్లోనే తలదాచుకుంటున్నారు. కొన్ని చోట్ల అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నప్పటికీ, చాలావరకు వృద్ధాశ్రమాల్లో నిధుల లేమితో సరైన వసతులు కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వమే వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడంతో ఇకపై జిల్లాలో నిరాధరణకు గురైన వృద్ధులకు అన్ని వసతులతో కూడిన ఆశ్రయం అందుబాటులోకి వచ్చింది. వృద్ధాశ్రమంలో వృద్ధులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించడం, వ్యాయామం (ఫిజియో థెరపీ) చేయించడం, వైద్యులు అందుబాటులో ఉండడంతో మేలు జరగనుంది.

అడ్మిషన్లు ప్రారంభం

ఈ వృద్ధాశ్రమంలో 18 మంది వృద్ధులు ఉన్నారు. వారిలో 13 మంది పర్మినెంట్‌గా, ఐదుగురు మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. ఐదుగురు డేకేర్ ఉండగా వారిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. హోమ్ కోఆర్డినేటర్ ఎం.మమత ఆధ్వర్యంలో 12 మంది సిబ్బంది వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఈ వృద్ధాశ్రమంలో అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు.



వృద్ధుల కొరకు బెడ్స్



డైనింగ్ హాల్

వృద్ధులను గౌరవించాలి



నేటి తరానికి, రేపటి తరానికి మార్గదర్శకులు వృద్ధులే. వారిని మలి సంధ్యలో ఇంటి నుంచి గెంటేయడం హేయమైన చర్య. వారి బాగోగులు చూసుకోవడం వారిని గౌరవించడం సమాజం యొక్క బాధ్యత. ప్రభుత్వం ముందుకు వచ్చి వృద్ధాశ్రమాలు నెలకొల్పడం గొప్పవిషయం. – పూర్మాని మంజుల, జెడ్పీటీసీ, తంగళ్లపల్లి

ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషం



మండెపల్లిలో వృద్ధాశ్రమం ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకరం. మేము కూడా తరుచూ వృద్ధాశ్రమానికి వెళ్లి పిల్లల నిరాధరణకు గురైన వృద్ధులకు సేవ చేసుకునే భాగ్యం కలుగుతుంది. వారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం. – పడిగెల మానస, ఎంపీపీ, తంగళ్లపల్లి

అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి



మండెపల్లిలో చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వృద్ధాశ్రమ పనులు పూర్తయ్యాయి. అన్ని హంగులతో నిర్మించాం. త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాలతో అడ్మిషన్లు ప్రారంభించాం. – లక్ష్మీరాజం, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, సిరిసిల్ల

క్లుప్తంగా

అభివృద్ధి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం నాంపల్లి ఐదో వార్డులోని తెనుగుపల్లె దారికి సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులు జరుగుతుండటంతో వాటిని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ విలీన గ్రామాలను అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించగా, నాంపల్లి ఐదో వార్డుకు రూ.60 లక్షలు అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వార్డులోని వీధి దీపాలు, ఇళ్లకు విద్యుత్ మీటర్లు, నీటి సమస్యలు ఉన్నట్లు కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని అమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జడల లక్ష్మి, వేములవాడ సెస్ డైరెక్టర్ నామాల ఉమ పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుడు ఆంజనేయులుకు సత్కారం



ఆంజనేయులును సత్కరిస్తున్న ప్రతినిధులు

వేములవాడ: గ్రంథాలయ ఉద్యమకారుడు వీరగోని ఆంజనేయులు చేస్తున్న కృషిని గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో ఆదివారం ఘనంగా సత్కరించారు. సొంత నిధులతో వేములవాడలో గ్రంథాలయం ఏర్పాటు చేసి రెండు లక్షలకు పైగా సాహిత్య పుస్తకాలతోపాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ అందుబాటులో ఉంచుతూ సామాజిక సేవ చేస్తున్న ఆయనను సంస్థ గుర్తించి ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, జడ్జి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఒక నిరుపేద విద్యార్థినికి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ రూ.80 వేల విలువగల ల్యాప్‌టాప్‌ను ఆదివారం అందజేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బొల్గం వరలక్ష్మి – శ్రీనివాస్ దంపతుల కూతురు సంజనీ బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ల్యాప్‌టాప్ కొనలేని పరిస్థితిలో సహాయం అందించిన గోవర్ధన్ గౌడ్‌కు ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వంగల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ



చందుర్తి: రామారావుపల్లెలో పోచమ్మ బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/చందుర్తి: చందుర్తి మండలం రామారావుపల్లె, కోనరావుపేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో మహిళలు పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల, జెడ్పీటీసీ నాగం కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



నారాయణపూర్‌లో..

చిత్రకథ



నాటిన చేతులతోనే నరికారు

వేములవాడరూరల్: హరితహారంలో భాగంగా అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఏ చేతులతో మొక్కలు నాటారో, అదే చేతులతో నరికేయాల్సి వచ్చింది. ముందుచూపు లేని అధికారులు విద్యుత్ వైర్ల కిందే మొక్కలు నాటడంతో నేడు వాటిని నరకాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులకు ఎంత చెప్పినా వినకుండా, మండలంలోని మల్లారం బస్టాండ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటారు. అవికాస్తా పెరిగి పెద్దవై విద్యుత్ అంతరాయానికి కారణమవుతున్నాయని తొలగించాల్సి వచ్చినప్పుడు, అదే చేతులతో నరికివేశారు.

ఆకలి మంట – ఆందోళన బాట



వేములవాడలో సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు

వేములవాడరూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేస్తున్న ఐకేపీ వీవోల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. చాలా ఏళ్లుగా పని చేస్తున్నా తమకు న్యాయం జరగడం లేదంటూ వారు ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ఇప్పటికే పలుసార్లు ప్రభుత్వానికి, పాలకులకు విన్నవించుకున్నప్పటికీ న్యాయం జరగకపోవడంతో రెండు రోజుల నుంచి ఐకేపీ, వీవోఏలు సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరింది. ఇప్పటికే గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే కార్యదర్శులు ఆందోళన చేపడుతున్నారు. వారికి తోడు వీరు కూడా ఆందోళన చేయడంతో రోడ్లపై తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు తొమ్మిది డిమాండ్లతో సమ్మెకు దిగారు.

చర్చకు సిద్ధమైన బీజేపీ నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో బీజేపీ నాయకులు ఆదివారం బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఐదు రోజుల క్రితం బీజేపీ నాయకులు ధాన్యం కొనుగోళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధర్నా చేపట్టగా, ధాన్యం సేకరణలో బహిరంగ చర్చకు సిద్ధమని సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు సవాల్ విసిరారని, దీనికి తాము సిద్ధంగా వున్నామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ ప్రతి సవాల్ చేశారు. పోతుగల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తాము వేచి ఉన్నామన్నారు. ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తమతో చర్చకు రాలేదన్నారు. రైతులు తాము ఎదుర్కొంటున్న కష్టాలను వివరించారన్నారు. రోజుల తరబడి ధాన్యం రాశుల వద్ద పడిగాపులు పడుతున్నామని తెలిపారన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు పడుతున్న బాధలను వివరించారని తెలిపారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని తీసుకోవడం లేదన్నారు. చర్చకు సవాల్ విసిరిన నాయకులు ముందుకు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. అధికారంలో ఉండి రైతులకు సేవలు అందించడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రంలో టార్పాలిన్లు లేక బతుకమ్మ చీరలను ధాన్యం కుప్పలపై కప్పారన్నారు. ఇవి బీఆర్ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు మీస సంజీవ్, శంకర్, మెంగని మహేందర్, బండి శ్రీకాంత్, కిట్టు పాల్గొన్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న నాయకులు

భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు

చందుర్తి/వీర్నపల్లి: బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో సిరిసిల్ల నియోజకవర్గ కార్యదర్శి ఇసంపల్లి కొమురయ్య, బీఎస్పీ వీర్నపల్లి మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల ప్రశాంత్, మండల సెక్టార్ అధ్యక్షుడు కన్నం జనార్దన్, గర్జన పల్లి బూత్ అధ్యక్షుడు గజ్జెల శ్రీనివాస్,పార్టీ కార్యవర్గ సభ్యులు కట్కూరి శంకర్, గుడిసే గంగరాజం, దేశవేని భూమేశ్, సుంచు అనిల్ కుమార్, దయ్యాల ఉదయ్, లింగాల రవి, తర్రె గణేశ్, లింగాల దేవరాజ్ ఉన్నారు.

ముగిసిన చదువుల పండుగ



మాట్లాడుతున్న సురేంద్రబాబు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫుల్‌బ్రైట్ గ్లోబల్ టీచర్స్ గ్రాంట్ ప్రాజెక్ట్ అమెరికా వారి సహకారంతో వారం రోజుల పాటు కొనసాగిన చదువుల పండుగ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రముఖ వైద్యులు సురేంద్రబాబు మాట్లాడుతూ చదువు ఒక్కటే ఉన్నత స్థానాలలో నిలబెడుతుందని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఇంజినీర్ ప్రదీప్ మాట్లాడుతూ రానున్న కాలంలో టెక్నాలజీపై ఆధారపడాల్సిన అవసరం ఉంటుందని, విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం టీచర్ లింగాల రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, టీచర్లు, ,గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లి గ్రామంలో గ్రామ దేవతలైన ముత్యాల పోచమ్మ, సార్గమ్మ, నీరయ్య దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొదట పోచమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహానికి మహిళలు బిందెలతో తెచ్చిన నీటితో అభిషేకించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



చందుర్తి: స్థానిక శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ నిర్మాణ దాత పుల్లూరి మల్లేశం దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జెడ్పీటీసీ నాగం కుమార్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ జంగ్ సైరన్‌ను విజయవంతం చేయాలి

కోనరావుపేట: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా కోరారు. మండలంలోని నిమ్మపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు పశువులు బలి

కోనరావుపేట: మండలం మల్కపేట గ్రామంలో పిడుగుపడి ఎద్దు, గేదె మృతి చెందాయి. గ్రామానికి చెందిన గుడిపాటి మోహన్‌రెడ్డి అనే రైతు తన పొలం వద్ద చెట్టు కింద ఒక గేదె, ఒక ఎద్దును కట్టేసి ఇంటికి వచ్చాడు. సాయంత్రం పిడుగుపడడంతో రెండు ఒకేసారి మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకొని షాక్‌కు గురైన రైతు మోహన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

గ్రామ అవసరాలకు స్థలం కేటాయించాలి

వీర్నపల్లి: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో గ్రామ అవసరాలకు భూమిని కేటాయించే విధంగా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఆయనతో కలిసి మాట్లాడారు. గ్రామంలో ఏడు పాఠశాలలు ఉన్నాయని విద్యార్థులు ఆడుకోవడానికి, రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. కౌన్సిలర్లు సత్యనారాయణ, రెడ్డినాయక్, సింగిల్‌విండో చైర్మన్ జిలకిషన్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ వెంకటరమణారావు, నాయకులు ఉన్నారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న ఆలయ పరిసరాల్లోని వంద మంది పేదలకు అన్నదానం నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, వెంకటేశ్వర్ రావు, నర్సింహారెడ్డి, ప్రతాప సంపత్, రవీందర్ చంద్రశేఖర్, చల్లా సత్తయ్య, కొప్పుల హన్మండ్లు తెలిపారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందజేస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పల్లాటి లక్ష్మి, బాబు దంపతుల కూతురు పూజ వివాహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు లగిశెట్టి శ్రీనివాస్ పుస్తెమెట్టెలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కోల కృష్ణ, మీస సంజీవ్, రాంగోపాల్, శ్రీనివాస్‌రావు, శంకర్, కిట్టు పాల్గొన్నారు.

బిల్లులు తిరస్కరించడం సరికాదు

సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం పెట్టిన ట్రెజరీ బిల్లులను ఏక మొత్తంగా తిరస్కరించడం సరికాదని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. ఏక మొత్తంగా ట్రెజరీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలు ఇతర బిల్లుల చెల్లింపుల్లో అనుసరిస్తున్న విధానాన్ని పునః సమీక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీ ద్వారా సమర్పించిన బిల్లులు కొన్ని నెలల కాలంగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో పెట్టి తాజాగా ఏక మొత్తంగా రిజెక్ట్ చేయడం ఉపాధ్యాయ వర్గాలకు ఆవేదన గురిచేసిందన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సమర్పించిన బిల్లులు తిరస్కరించి మళ్లీ తాగా టోకెన్లు జనరేట్ చేయడం బిల్లుల చెల్లింపులకు మరింత జాప్యానికి దారితీస్తుందన్నారు. సమర్పించిన బిలుల చెల్లింపుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

బోయినపల్లి: కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో ఉన్న మండలంలోని కొదురుపాక చౌరస్తాలో ఆదివారం సాయంత్రం ఎస్సై మామిడి మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సోమవారం నుంచి ఈ నెల 12 వరకు వేములవాడ మండల పరిధిలో మిడ్‌మానేరు ముంపు గ్రామాల ఐక్య వేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేస్తూ, వాహన పత్రాలు పరిశీలిస్తున్నారు.

జీవో రావాలి.. జీపీకి పోవాలి

తంగళ్లపల్లి: ప్రభుత్వం నుంచి అధికారికంగా రెగ్యులరైజ్ చేసినట్లు జీవో విడుదల చేస్తేనే గ్రామపంచాయతీల్లో తిరిగి విధుల్లో చేరుతామని జేపీఎస్, ఓపీఎస్‌లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జేపీఎస్, ఓపీఎస్ శాంతియుత నిరవధిక సమ్మె శిబిరాన్ని తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారం నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసి దీక్షలు అక్కడి నుంచే కొనసాగిస్తామన్నారు. ×జీవో రావాలి జీపీకి పోవాలి₹ నినాదంతో సాగుతామని తేల్చిచెప్పారు. విధుల్లో చేరకుంటే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తే భయపడేది లేదని ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే న్యాయస్థానాల తలుపు తడతామని, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసముందన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామ మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శనివారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవత తెలిపారు. ప్రతి ట్రాక్టర్ నిర్ణీత అనుమతి తీసుకుని అవసరాలకు ఇసుక రవాణా చేసుకోవచ్చని, అలా కాకుండా ట్రాక్టర్లలో అనధికారికంగా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ధాన్యం తూకం వేగవంతం చేయాలి

ఇల్లంతకుంట: మండలంలోని గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేగవంతంగా చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మ్యాకల మల్లేశం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇల్లంతకుంట మండలంలోని కొనుగోలు కేంద్రాల పరిస్థితిని సమీక్షించాలని, ధాన్యం వేగంగా మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెల్ ఫోన్ వ్యసనం –విద్యార్థుల భవిష్యత్తు అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్త్‌ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాజు, సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత తదితరులు పాల్గొన్నారు.